ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



సాక్షి,సిటీబ్యూరో: వాసవీ వనితా క్లబ్ ప్రశాంత్ నగర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ కొత్తమాసు రమేష్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు రావికంటి సత్య, శ్రీ సెక్రటరీ రుద్రంగి విజయ, కోశాధికారి సవిత విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి యాదలక్ష్మి కుమారి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

బీఎస్‌రెడ్డి నగర్‌లో..

లింగోజిగూడ: బీఎస్‌రెడ్డినగర్ ఫేజ్–1లో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, ఉపాధ్యక్షుడు నవీన్, నాయకులు రవికిరణ్, రాములు, వెంకట్‌రెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, ప్రభాకర్, విష్ణువర్ధన్, పవన్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లచ్చిరెడ్డి

ఆన్‌లైన్‌లోకి ప్రజాపాలన దరఖాస్తులు

- మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో మొత్తం 70284 అర్జీల స్వీకరణ
- శనివారం నుంచి మొదలైన డేటా ఎంట్రీ నమోదు

చాదర్‌ఘాట్: జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 29 కేంద్రాల ద్వారా అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించారు. అభయహస్తం కింద మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల ద్వారా ప్రభుత్వ సాయం పొందేందుకు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.

- బస్తీలు, కాలనీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. సర్కిల్–6లో ఈనెల 6వ తేదీ వరకు 70284 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా 20 మంది డీటీపీ ఆపరేటర్లను నియమించారు.
- ఇప్పుడున్న ఆపరేటర్లు సరిపోక పోతే ప్రైవేట్ వాళ్లను నియమించాలని ఆదేశాలు అందాయి. ఈనెల 17 వరకు నమోదు పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు.



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లోకి ఎంట్రీ చేస్తున్న డీటీపీ ఆపరేటర్లు

గడువులోగా నమోదు పూర్తి చేస్తాం



ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా శనివారం డీటీపీ ఆపరేటర్లకు జోనల్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చాం. వీరు ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఎలా నమోదు చేయాలనే అంశంపై అవగాహన పెంచుకుంటారు. శనివారం నుంచే నమోదు ప్రక్రియ మొదలైంది. ఈనెల 17లోగా పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం. ఇప్పుడు వచ్చిన ఆపరేటర్లతో పాటు కొత్తగా వచ్చిన వారితో నమోదు ప్రక్రియను ముమ్మరం చేస్తాం.

–డీసీ జయంత్

- అధికారులు అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. అయితే ఈ సర్వే ఎప్పుడు చేస్తారు, లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు చేస్తారు, దీని ప్రాతిపదిక ఏమిటి, ఏ అర్హతలు చూస్తారు, ఆధార్ కార్డ్, తెల్లరేషన్‌కార్డులలో దేనిని పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

రైతులు, వ్యాపారుల సంక్షేమానికి కృషి



చేగూరి వెంకటరమణను సన్మానిస్తున్న మైల రవికాంత్

చాదర్‌ఘాట్: రైతులు, వ్యాపారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ నూతన అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరమణను మలక్‌పేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైల రవికాంత్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న వ్యాపారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. వ్యాపారుల అభ్యున్నతితో పాటు మార్కెట్‌కు వచ్చే రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మైల శ్రీకాంత్, మైల రజనీకాంత్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కేలండర్ ఆవిష్కరణ



లింగోజిగూడ: కొత్తపేట డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో ఆదివారం కొత్తపేట ఆర్యవైశ్య సంఘం కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిథులుగా పాల్గొని కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్యగుప్తా, వెంకటేశంగుప్తా, నేతి రాములు, అశోక్, సురేందర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెంపొందించాలి



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

చంపాపేట: విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త సూర్యకిరణ్ సూచించారు. ఆదివారం చంపాపేటలోని భాష్యం లిటిల్ చాంప్స్ పాఠశాల 13వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ప్రకల్పనా పద్ధతిలో బోధిచాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ఫోక్, శాస్త్రీయ, వెస్టర్న్ నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. అనంతరం మెరిట్ మార్కులు సాధించిన చిన్నారులకు ఆయన మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి అంకమరావు, ప్రిన్సిపాల్ ప్రీతి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' యాత్రతో కేంద్ర పథకాలపై అవగాహన

సైదాబాద్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అందరికీ అవగాహన, లబ్ధి చేకూరుతుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని అస్మాన్‌ఘడ్ వద్దకు సంకల్ప్ యాత్ర వాహనం చేరుకుంది. వాహనానికి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శిస్తూ వివరించారు. పథకాల దరఖాస్తులను ప్రజలకు అందజేశారు. ఆయుష్మాన్ భారత్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి ఔషధాలు అందజేశారు. కార్యక్రమాన్ని వ్యవసాయ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఆషా, సంరెడ్డి సురేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జోనల్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్త రఘునందన్, జగన్‌మోహన్‌రావు

హస్తినాపురం: విద్యార్థులు విద్యతో పాటు వినయంతో వ్యవహరించినప్పుడే వారు అన్నిరంగాలలో రాణిస్తారని ఇస్రో శాస్త్రవేత రఘునందన్ అన్నారు. ఆదివారం నిర్వహించిన హస్తినాపురం అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాప్సోడి 2024 పేరుతో నిర్వహించిన వార్షిక వేడుకలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల చైర్మన్ జగన్ మోహన్‌రావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గత సంవత్సరం పాఠశాల సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇస్రో శాస్త్రవేత్త రఘునందన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది సాధించే దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ మదన్‌మోహన్‌రావు, రామారావు, ప్రిన్సిపాల్ రమణి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని సంరక్షించుకోవాలి

కాచిగూడ: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడలోని క్వాలిటీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ రామాలయం వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నేత సుభాష్ పటేల్ అయోధ్య శ్రీరాముని అక్షింతలతో కూడిన కలశాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కాచిగూడ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, చక్రపాణి, రాము, రవిశంకర్, సుదర్శన్, మల్లికార్జున్, సంతోష్, ఫంకజ్, అరవింద్ పాల్గొన్నారు.



రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 21, వంకాయ 35, బెండ 45, పచ్చి మిర్చి50, కాకర 55, బీర 40, క్యాలీఫ్లవర్ 23, కేబేజీ 18, కారెట్ 33, దొండ 35, ఆలు 25, ఉల్లి 24, గోకర 45, దోస 35, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 50, అర్వి 50, మునగ 70, చిలగడదుంప 50, బీట్‌రూట్ 21, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 65. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు జోనల్ కార్యాలయంలో ప్రజావాణి

చైతన్యపురి: కొత్తపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను దరఖాస్తు రూపంలో అందజేయాలని జడ్‌సీ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా దుర్గాభవానీ నగర్, మాదన్నపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో సోమవారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరి నగర్, దుర్గాభవానీనగర్ కాలనీల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు తమకు సహకరించాలని ఏఈ కోరారు.

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆలిండియా రేడియో, 11కేవీ లెక్చరర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



పీఆర్‌టీయూ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీపాల్‌రెడ్డి తదితరులు

పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ ఆలయ సమావేశ మందిరంలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు కన్నయ్య ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వంటి సమస్యలను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు గోవర్దన్ యాదవ్, కమలాకర్‌రావు, మోహన్‌రెడ్డి, రవీందర్, చెన్నకేశవరెడ్డి, ఇన్నారెడ్డి, నారాయణ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, జగన్మోహన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతా: లచ్చిరెడ్డి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న శ్రీపురం కాలనీ నూతన కమిటీ సభ్యులు

ఎల్‌బీనగర్: కాలనీల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీపురంకాలనీ ఫేజ్–2 సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లోని అన్ని కాలనీల్లోని సమస్యలను పరిష్కరించి సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతానని అన్నారు. కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం కాలనీకి నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నందుకు కాలనీ వాసులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, సలహాదారులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంటకరమణారెడ్డి, .ప్రభాకర్‌రెడ్డి, సుహాసిని, దీప తదితరుల పాల్గొన్నారు.

మాలలు అన్ని రంగాలలో సత్తా చాటాలి

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చంపాపేట: మాలలు అన్ని రంగాలలో రాణించి సత్తా చాటాలని చెన్నూరు శాసన సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం చంపాపేటలోని మంద యాదవరెడ్డి గార్డెన్‌లో జాతీయ మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాలల అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథి జాతీయ అంబేడ్కర్ రాష్ట్రీయ ఏక్తా మంచ్ అధ్యక్షుడు భవనాత్ పాశ్వన్‌తో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ, మాలల్లో ఎన్ని విభేదాలు ఉన్నా సమస్య ఉన్నప్పుడు సంఘితం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ బద్ధమైన హక్కుల సాధన కోసం మాలలు ఎటువంటి కార్యక్రమం చేపట్టినా తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. భవనాత్ పాశ్వన్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సహేతుకంగా లేదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలోని ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునేందుకే మళ్లీ తెరపైకి వర్గీకరణ అంశాన్ని తెస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల వర్గీకరణను అడ్డుకోకపోతే మాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మాలల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు.కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్, సభ్యులు రఘురాం, ఆవుల సుధీర్‌కుమార్, మన్నె శ్రీరంగ, లక్ష్మణ్, హన్మంత్, భుజరంగరావు, కృష్ణ ప్రసాద్, మోహన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యవేదిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



లయోలా మోడల్ హైస్కూలు 1987 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు

వనస్థలిపురం: వనస్థలిపురం లయోలా మోడల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల (ఎస్ఎస్‌సీ 1987 బ్యాచ్) సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు ప్రసాద్, సునీల్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కిశోర్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, రమేష్‌గౌడ్, వెంకటరమణ, ఇందిర, సింధూర తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సాబిర్ మొహియుద్దీన్

చాదర్‌ఘాట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్టన్‌లో నివసించే సెక్యూరిటీ గార్డ్ మహ్మద్ మొయినుద్దీన్ కుమారుడు మహ్మద్ సాబిర్ మొహియుద్దీన్ (19) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గత నెల 12న బయటకు వెళ్తున్నానని ఇంట్లోవారికి చెప్పి వెళ్లిన సాబిర్ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ తెలియరాలేదు. దాంతో శనివారం యువకుడి తండ్రి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

కాచిగూడ: మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని అంబేడ్కర్ కాలేజ్ చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ జి.సరోజ వివేక్ అన్నారు. ఆదివారం కాచిగూడ, హర్రాస్‌పెంట శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ, ఉచిత క్లినిక్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్ రావు అధ్యక్షత వహించారు. హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ ఐ.రాధిక కృష్ణ, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు, ప్రబంధక సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

20, 21వ తేదీల్లో ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలు

హిమాయత్‌నగర్: బాలికల ఆత్మ రక్షణ కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఖేలో ఇండియ మహిళా కిక్ బాక్సింగ్ లీగ్' పోటీలు ఈ నెల 20, 21వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో 10 సంవత్సరాలకు పైబడిన అమ్మాయిలు, మహిళలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... వయస్సు, బరువును బట్టి ప్రత్యర్థులను నిర్ధారించి పోటీలు నిర్వహస్తామని తెలిపారు. కిక్ బాక్సింగ్ శిక్షణ పొందిన ప్రతి మహిళ అర్హులన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సాధారణ రూ. 200 రుసుము చెల్లించాలని వారు తెలిపారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు నర్సింగ్ రావు, శేఖర్, పోచయ్య, తిరుపతి, పూర్ణచందర్, రవికుమార్, ఆంజనేయులు, శివ పాల్గొన్నారు.

యాదవ మహాసభ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



లింగోజిగూడ: అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగోలుకు చెందిన చింతల కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం నాగోలులో జరిగిన మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావు నియామక పత్రాన్ని అందజేశారు. యాదవుల సమస్యలపై నిరంతరం పోరాడతానని ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ తెలిపారు. నాయకులు చింతల రవీందర్, రమేష్‌యాదవ్, యశ్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ రాములోరి అక్షింతల వితరణ



మూసారంబాగ్‌లో అక్షింతల ఊరేగింపులో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు



గౌతంనగర్‌లో అక్షింతలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

మలక్‌పేట: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మూసారంబాగ్ డివిజన్‌లోని బస్తీలలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతల మహా వితరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి బస్తీవాసులతో కలిసి అక్షింతలకు ఘనంగా స్వాగతం పలికారు. బస్తీల్లో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ స్వామివారి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, యాదగిరి సురేందర్, బైన్వాడీ రాజేష్, కొంగర ప్రవీణ్, భరత్, గిరిజ, అంబాభాయి, సదానంద్, ఉదయ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు కాలనీలో...

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీలో ఆదివారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు, ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు డా.సిరిపురపు అప్పారావు, పలువురు బీజేపీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



హైకోర్టు కాలనీలో అక్షింతలు పంపిణీ చేస్తున్న డా.అప్పారావు తదితరులు

గౌతంనగర్‌లో...

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ గౌతంనగర్‌లో ఆదివారం రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో అక్షింతలను కాలనీలోకి ఆహ్వానించి ఊరేగింపుగా గడపగడపకూ వెళ్లి అందజేశారు. కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, స్థానికులు కీర్తిగారి అనంతాచారి, కృష్ణయ్య, దేవేందర్‌రెడ్డి, హరికృష్ణ, కుమ్మమధు, విక్రమ్‌రెడ్డి, మారుతి, రాజేంద్రగౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పిండి నారాయణరెడ్డి కాలనీలో..

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని పిండి నారాయణరెడ్డి కాలనీలో ఆదివారం కాలనీ సంక్షేమం సంఘం అధ్యక్షుడు నీళ్ల మధుసూదన్‌గుప్తా ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, సంకీర్తనలతో ఊరేగింపుగా వెళ్లి కాలనీలోని ఇంటింటికీ అక్షింతలు అందజేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365